● కథానిక

# మృతుడి చివరి శ్వాస



● ఊపిరాడకుండా ఆ హాల్లో ఒక కథకుడు ఎందుకు చనిపోయాడు?

## నందిగం కృష్ణారావు

**కథ చచ్చిపోతోందని కథకుడు చాలా బాధపడ్డాడు. అతనెప్పుడో వయస్సులో వున్నప్పుడు, ఉద్యోగం లేని రోజుల్లో బోల్డన్ని కథలు ౖవాశాడు.**

అప్పట్లో అతను ౖపేమించినమ్మాయి అతనికాక్కుండా పోయినప్పుడు కథొచ్చి అతన్ని పలకరించి ఓదార్చింది.

అతనికి రావాల్సిన ఉద్యోగం ఎవరో తన్నుకు పోయినప్పుడు, అతనికి ౖబతుకు నూతిలోని చీకట్లో కనిపించినప్పుడు కథే అతన్ని కనికరించింది.

సాయం సంధ్యలో కన్నతల్లి కడతేరినప్పుడు బతుకంతా చీకటైపోయి, దారీ తెన్నూ తెలవక తను కొట్టుకొంటుంటే కథ తూర్పు వాకిలి తెరిచింది.

ఎన్నెన్నో కథలు అతన్ని చుట్టుముట్టి తమ గోడు వెళ్ళబోసుకునేవి. వాటి గోడు మధ్యన తన గోడు మరచిపోయే వాడతను. ఒక్కొక్కసారి తన గోడు కూడా వాటి గోడులో కల్సిపోయేది. అందుచేతే ఆ రోజుల్లో అతని కథలు అందరి గాథలై విశ్వఘోషను వినిపించేవి.

చూస్తుండగానే అతనికి ఉద్యోగం వచ్చింది. ఆ వెనకే బోల్డంత ఆస్తి తీసుకొని అందమైన భార్య అతని జీవితంలోకి అడుగుపెట్టింది.

ఒక ఇల్లు సమకూరింది.

పిల్లలు పుట్టుకొచ్చేరు. వాళ్ళకి తను చదివిన సాహిత్యంలోంచి ఆదర్శవంతమైన పేర్లు ఏరి కోరి పెట్టాడు. అలాంటి పేర్లు పెట్టగల సత్తా తన సర్కిల్లో తన భర్తకొక్కడికే వున్నందున అతని భార్య తెగ గర్వపడేది.

ఒకరికి చేయి జాపాల్సిన అవసరం లేని వాళ్ళు అతన్ని మంచి కథకుడుగా గుర్తించారు.

సంఘంలో అతని పేరుకు మంచి రచయిత అన్న పదం అతని యింటి పేర్లా మారిపోయింది.

పూర్వం రాసిన కథల్ని అందంగా అచ్చు వేయించుకొన్నాడు.

ఆవిష్కరణ సభ పెట్టి తను అభివృద్ధిలోకి రావడానికి తోడ్పడే అధికార్లచే పొడిగించుకొన్నాడు.

ఎకాడమీ వాళ్ళు అతనికి అవార్డు యిచ్చారు.

అప్పటి నుంచీ అతనికి అధికారులలో కవులు కనిపించారు. ఆఫీస్ నోటులలో సాహిత్యం కనిపించింది. తక్కిన సాహిత్యం అంతా ఏదో వెలితిగా, ఏదో అసంతృప్తిగా తనని నిలేసి ప్రశ్నిస్తున్నట్లుగా అనిపించింది. విసుగుతో సాహిత్యం చదవడం మానేవాడు.

ఎప్పటినించో తన హృదయ పరమపద సోపానంలో వున్న పాములన్నిటినీ చంపేశాడు. బ్రతుకులో ఉన్నత శిఖారాల్ని అధిరోహించాడు. తను అన్ని విషయాల్నీ జడ్జ్ చెయ్యగలనన్న నిర్ణయానికి వచ్చాడు.

కథ వ్రాయాలని ప్రయత్నించాడు. రాయలేక మానేశాడు. కథ చచ్చిపోతుంది. కాబట్టి తను కథల్రాయలేక పోతున్నానని నిర్ధారించుకొన్నాడు. కథని బ్రతికించాలని కంకణం కట్టుకొన్నాడు.

అతనిలాగే పూర్వాశ్రమంలో ఒకటి అరా కథల్రాసి, రాసిన కథలకి రావల్సినంత ఖ్యాతి రాలేదని బాధపడుతున్న కొందరు కథకుల్లో చేరి "కథ"ని గురించి జాతీయ స్థాయి సమావేశాన్ని చెయ్యాలనుకున్నారు. వారూ, వీరూ అన్న తేడా లేకుండా, యిజాల్తోటీ, నిజాల్తోటి సంబంధం లేకుండా కథకులందర్నీ ఒక తాటికి చేర్చేట్లైతే అందుకయ్యే ఖర్చు భరించడానికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తపర్చింది.

కథకుడి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పడింది. కథని బ్రతికించడానికి కంకణం కట్టుకొన్న కథకులందర్నీ సమావేశానికి రమ్మని కథకుడు దేశంలో వున్న కథా రచయితలందరికీ ఆహ్వానాలు పంపాడు.

కథకులుతమ కథ గురించీ, తమకు నచ్చిన కథల్ని గురించి మాట్లాడవచ్చని అతను ప్రకటించాడు.

ఆ దెబ్బతో కథకులంతా తమ మధ్యన వున్న భేదాభిప్రాయాలు మర్చిపోయి యముడు లాక్కెళుతున్న కథని కట్టి పడేయ్యడానికే పలువుతాడులా పెనవేసుకుపోయారు.

ప్రభుత్వ సహాయంతో కథకుడి అధ్యక్షతన అకాడమీ హాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఆ వేళ పొద్దున్నే కథకుడు సమావేశానికి బయలుదేరాడు.

అవడానికది చలికాలం.అయినా బయట అంతా వేడిగా వుంది. ఆ వేడి కథని బ్రతికించడానికి సమావేశం కాబోతున్న కథకుల ఉచ్ఛ్వాశ, నిశ్వాసాల్నించి జనించిందనిపించింది కథకుడికి. తనలో తనే నవ్వుకొన్నాడు. ఎవరో అతని చెంప మీద చెళ్ళున కొట్టాడు. కోపంతో అతని మొహం ఎర్రబడిపోయింది. అలా కోపం తెచ్చుకోవడం తన పెద్దరికానికి మంచిది కాదనుకొని, ఆ కొట్టిన వాళ్ళు తనకి బాగా పరిచయం వున్న వాళ్ళన్నట్లుగా "ఏవోయి బావున్నావా" అని పలుకరించాడు. "బాగోలేకేం? నిక్షేపంలా వున్నాను. ఇంతకీ నన్ను పోల్చుకున్నావా?"

"పోల్చుకోక... పోల్చుకోకేం?" అని గొణుగుతూ చుట్టూ చూశాడు కథకుడు.

అక్కడెవరూ కనిపించలేదు. తను మనుషుల మధ్య వున్నట్లనిపించలేదు. తనెక్కడ శూన్యంలో, అది చీకటో, వెలుగో తెలవని అగాధంలో వున్నట్లనిపించింది.

భయపడిపోయాడు. "నువు.. నువు... నువ్వు ఎవరివి" అని అడగాలనుకున్నాడు. కానీ అతని గొంతు పెగల్లేదు. అతని గొంతులోంచి ఎలాంటి శబ్దం బయటకు రాలేదు. పెదాల్లు మాత్రం కదిలాయి. ఆ కదలికని బట్టి అతను మాట్లాడాలనుకొన్న విషయాన్ని గ్రహించినట్లుగా, "భయపడకు" నేను ఎవరినో చెబుతాను విను.. నిన్నటివరకూ నేను పవన్‌కుమార్ని..." అన్నాడతను.

యీ పేరు ఎక్కడో విన్నట్లుగా అనిపించింది కథకుడికి. జ్ఞాపకం చేసుకోవాలని ప్రయత్నించాడు.

"నేను నీకు గుర్తుకు రాను"

"ఎందుకూ" అని అడగాలనుకొన్నాడు. కాని అడగలేక పోయాడు. అది నీకు తరువాత తెలుస్తుంది. "నన్ను ఒక దొంగతనం కేసులో అరెస్టు చేసి జైల్లో పెట్టారు. నన్ను అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్ మొదట్లో నాకు చాలా దుర్మార్గుడ్లా కనిపించాడు. అబద్ధపు కేసు కట్టి జైలుపాలు చేసినందుకు నాకు అతని మీద కోపం వచ్చింది. కానీ అతనిలో ఏ దేవుడు ప్రవేశించాడో తెలవదు కానీ అతనే తనకు స్వయంగా బెయిలు పెట్టించాడు. తన పలుకుబడిని ఉపయోగించి యిద్దరితో జామీనిప్పించి నన్ను విడుదల చేయించాడు. జైల్నించి బైటికి వచ్చిన తరువాత 'నీ మీద కేస్ ఎత్తేస్తున్నానని చెప్పి నమ్మించి తీసుకువెళ్ళి గోదావరి ఒడ్డున కాల్చేశాడు. ఆ తరువాత నాకు పవన్‌కుమార్ అన్న పేరు పెట్టి, పవన్‌కుమార్ అన్న అజ్ఞాత తీవ్రవాది ఎన్‌కౌంటర్‌లో మరణించాడని ప్రకటించాడు. ప్రభుత్వం అతనికి ప్రమోషన్ యిస్తానని ప్రకటించింది. అతనికి రాష్ట్రపతి అవార్డు కూడా రావచ్చు.

"యిప్పుడు నువు దెయ్యానివా" అని అడగాలనుకొన్నాడు కథకుడు. అతనికి విపరీతమైన దాహం వేసింది. గొంతు తడారిపోయింది.

నేను దెయ్యాన్ని కాదు. నిన్న సాయంత్రం ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయబడ్డ పవన్‌కుమార్ చివరి శ్వాసని"

యిదంతా ఏ పోలీస్‌వాడైనా వింటే తనకి నిజం తెలిసినందుకు, తనను కూడా తీవ్రవాదిగా జమకడతాడన్న భయం కొత్తగా అతన్ని ఆక్రమించింది.

"చచ్చాను" అనుకొన్నాడతను. "నువ్వు యిప్పుడు ఉట్టిగాలివేనా" అని అడిగాడు కథకుడు.

"కాదు, నేను కథని" అంటూ ఆ గాలి అక్కడ్నించి వెళ్ళిపోయింది.

"ఊపిరాడక అకాడమీ హాల్లో కథకుడు చచ్చిపోయాడు.

రహస్యంగా సిగరెట్లు కాల్చడం నా సరదా!

డియర్ ఎడిటర్!

"గత సంచికలో 'స్మోకింగ్'గురించి మీరు ప్రచురించిన వ్యాసం చదివాను. నా వయస్సు 28ఏళ్లు రహస్యంగా సిగరెట్లు కాల్చడం నాకు సరదా.

ఓ అమ్మాయి అనుభవాలు



అమ్మాయిల్లో చైన్ స్మోకర్స్ ఉంటారా? అని ఆశ్చర్యపోకండి! నాకు సిగరెట్ తాగడం ఎలా అలవాటైందో తెలుసా?"

అంటూ ఓ అమ్మాయి చెప్తున్న అనుభవాలు

— వచ్చే సంచికలో